క్లుప్తంగా

అంబేడ్కర్ చిరస్మరణీయుడు


డాక్టర్ భావన

విజయనగరం ఫోర్ట్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతివనాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 19న ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సుమారు 19 ఎకరాలలో దాదాపు 400 కోట్ల రుపాయల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం, కాంస్య విగ్రహం చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దన్నానపేటలో చోరీ


పరికరాలను పరిశీలిస్తున్న సర్పంచ్ రామచిరంజీవి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేటలో విద్యుత్ సామగ్రిని గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. గ్రామానికి మంచినీటిని సరఫరా చేసేందుకు పంపింగ్ ఆపరేటర్ అచ్చప్పుడు బుధవారం ఉదయం వెళ్లగా షెడ్డు తాళం విరగ్గొట్టడాన్ని గమనించి వెంటనే సర్పంచ్ గేదెల రామచిరంజీవి, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కు సమాచారం అందించాడు. దీంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. మంచినీటిని సరఫరా చేసే ప్యానెల్ బోర్డుతో పాటు మరో నాలుగు విలువైన విద్యుత్ కటౌట్‌లు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సర్పంచ్ ఫిర్యాదు చేశారు.

ఆలోచన మంచిదైతే ఏదైనా సాధించొచ్చు


పూజా కార్యక్రమంలో పాల్గొన్న వేణుగోపాలనాయుడు

రేగిడి: పుట్టిన ప్రతి వ్యక్తికి సమాజానికి మంచి చేయాలన్న ఆలోచన ఉంటే ఏదైనా సాధించవచ్చని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు అన్నారు. రేగిడి విశ్వసాయి మందిరంలో రుత్వికులు వేమకోటి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంపాదనలో కొంతభాగాన్ని దైవ కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు, రుత్వికులు అంపోలు రామ్‌ప్రసాద్ శర్మ, వేమకోటి జానకీరామ్ శర్మ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం


108 అంబులెన్స్‌లో పసిబిడ్డతో సిబ్బంది, బాలింత, బంధువులు

బొబ్బిలి: మండలంలోని పక్కి గ్రామానికి చెందిన నిండు గర్భిణి వంగపండు సంధ్య 108 అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. బుధవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. వైద్యుడు శ్రీకాంత్ సూచనల మేరకు ఈఎంటీ ఆర్.శంకరరావు, పైలట్ యు.తిరుపతి ఆమెకు ప్రాథమిక వైద్య సేవలు అందించారు. అనంతరం తల్లి, బిడ్డను ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలందించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

బొండపల్లి: ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జాబ్ కో–ఆర్డినేటర్ జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న వారికి జిల్లా కేంద్రంలో ఉచిత వస తి, భోజన సదుపాయం కల్పించి వివిధ అంశాలపై మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం వివిధ సంస్థలతో పాటు కంపెనీల్లో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. హోటల్ మేనేజ్మెంట్, ప్రొడక్షన్ కెమిస్ట్రీ, రిటైల్ ట్రైనింగ్, సాఫ్ట్‌వేర్, నర్సింగ్‌లో శిక్షణ ఇస్తామని వివరించారు శిక్షణ అనంతరం డిమార్ట్, జూడియో, రెడ్డీస్, అరవింద్, మైలాన్ వంటి కంపెనీల్లో ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఆసక్తి ఉన్నవారు వివరాల కోసం 96668 02851 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

- మాంసం విక్రయాల్లో నిబంధనలకు తిలోదకాలు
- పరిశుభ్రత పాటించని వైనం
- పట్టించుకోని కార్పొరేషన్, వెటర్నరీ అధికారులు
- అధికారుల అలసత్వంతో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న దుకాణాలు


చిందరవందరగా పడేసిన స్కిన్‌లెస్ కోళ్లు

విజయనగరం: మాంసం విక్రయదారులు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. నాసిరకం, అనారోగ్య జంతువుల మాంసాన్ని ఎటువంటి అనుమతుల్లేకుండా ఇష్టారాజ్యంగా విక్రయించేస్తున్నారు. ఫ్రిజ్‌ల్లో మిగులుతున్న చికెన్, మటన్ నిల్వలను మరుసటి రోజు వినియోగదారులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే చికెన్, మటన్ వేస్ట్‌ను హోటళ్లకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఏ ఒక్కరూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగాధికారులు, వెటర్నరీ విభాగాల మధ్య సమన్వయలోపం కారణంగా నాసిరకం, నాణ్యత లోపించిన మాంసం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగరంలో చికెన్ సెంటర్లు 130, మటన్ విక్రయశాలలు 64 వరకు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం కిలో మటన్ ధర రూ.800 విక్రయిస్తుండగా.. కిలో చికెన్ రూ.180 నుంచి 200 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. అయితే చాలా దుకాణదారులు నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం నడుమ ఎక్కడ పడితే అక్కడే విక్రయాలు చేపడుతున్నారు. చేపల విక్రయాల పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉంది. మురుగు కాలువలకు అనుకుని , రోడ్ల మీదనే అమ్ముతున్నారు. ఆది, మంగళవారాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది.

పుట్టగొడుగుల్లా ..

రోజు రోజుకూ విస్తరిస్తున్న విజయనగరం నగరంలో చికెన్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారిక లెక్కల ప్రకారం 130 వరకు దుకాణాలు అనుమతులతో నిర్వహిస్తుండగా... అనధికారికంగా అంతకన్నా రెట్టింపు సంఖ్యలో దుకాణాలున్నాయి. ప్రధానంగా కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్, గూడ్స్‌షెడ్ రోడ్, కోట జంక్షన్, దాసన్నపేట జంక్షన్, రింగ్‌రోడ్, రైల్వేస్టేషన్ రోడ్, కలెక్టరేట్ జంక్షన్ వద్ద అధికారిక దుకాణాలు నిర్వహిస్తుండగా.. వీధికొకటి చొప్పున వెలుస్తున్న సెంటర్లు సైతం వందల్లో ఉండడం గమనార్హం. రోడ్డుపక్కన చిన్నపాటి బల్ల పెట్టి ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ విక్రయాలు చేపట్టి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. విచిత్రమేమిటంటే దుకాణదారులు కోళ్ల, చేపల వ్యర్థాలను సమీపంలోని కాలువల్లో వేస్తుండడంతో, ఆ ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి.

అపరిశుభ్రంగా చికెన్ సెంటర్లు

పట్టణంలో చాలా చికెన్ సెంటర్లు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కోళ్ల నిల్వ ఉంచే ప్రాంతం, వాటిని చంపి గ్రైండర్‌లో శుభ్రం చేసే ప్రదేశం, మాంసం నిల్వ ఉంచే తట్టలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ఈ విషయంలో దుకాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చికెన్ విక్రయ కేంద్రాలను పట్టించుకోవడం లేదు. వివిధ బ్యాక్టీరియాలతో ఉన్న చికెన్ తింటే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.

ఈ నిబంధనలు పాటించేవారేవరో...?

- అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే మాంసం విక్రయించాలి.
- కార్పొరేషన్‌కు చెందిన పశువైద్యాధికారి ధృవీకరించిన తర్వాతే జంతువధ చేయాలి.
- జంతువు ఆరోగ్యంగా ఉందా , బతికి ఉండగానే వధించారా..? లేదా అని వెటర్నరీ అధికారులు నిర్ధారించాలి. కానీ నగరంలో ఇటువంటి పరిస్థితులు లేవు.

ఈ జాగ్రత్తలు తప్పని సరి ...

- లేత తెలుపు రంగంలోని మాంసం ఆరోగ్య కరమైనది.
- గట్టిదనం ఉంటేనే తాజాదనం ఉన్నట్లుగా గుర్తించాలి.
- విక్రయిస్తున్న మాంసం కబేళా నుంచి తెచ్చినదా.. లేదా అన్నది దుకాణదారులను ప్రశ్నించాలి.
- ఎరుపురంగులో ఉన్నా, మడతలున్నా కొనకపోవడం మంచిది.
- కొన్ని సందర్భాల్లో చూడడానికి తాజాగా ఉన్నా వండే సమయంలో చెడువాసన వస్తే అలాంటి మాంసాన్ని తినకూడదు. అనుమానం వస్తే కార్పొరేషన్, వెటర్నరీ వైద్యులకు సమాచారం ఇవ్వాలి.

జాగ్రత్తంగా ఉండాలి..

నగరంలో అధిక మొత్తంలో మాంసం విక్రయశాలల ఉండడం నిజమే. వినియోగదారులు కూడా మాంసం కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలి. కార్పొరేషన్ ముద్ర వేసి ఉన్న మాంసం ఉత్పత్తులను కొనుగోలు చేయడం మేలు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు,
కమిషనర్, విజయనగరం కార్పొరేషన్.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం


బాధితులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: అయ్యన్నపేటలోని చెంచుల కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అండగా నిలిచారు. బుధవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయం కింద బియ్యం, దుస్తులు, కొంత నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెంచుల కాలనీలో ఆరు ఇళ్లు దగ్ధం కావడం విచారకరమన్నారు. బాధితులకు అవసరమైన సహాయం అందించడమే కాకుండా పక్కా ఇళ్లు మంజూరయ్యే విధంగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సుందరపేటలో ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలతో వైఎస్సార్‌సీపీ మండల యువజన నాయకుడు సుందర హరీష్

భోగాపురం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని సుందరపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, దివంగత సుందర గోవిందరావు జ్ఞాపకార్థం ఆయన తనయుడు వైఎస్సార్‌సీపీ మండల యువజన నాయకుడు సుందర హరీష్ అధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలు, సంక్రాంతి శోభ ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సుందర వెంటేష్, వెంకన్న, ఆళ్ల రమేష్, పోతిరెండి గోపి, ముద్దన శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

బాల కేంద్రంలో అడ్మిషన్లు ప్రారంభం

విజయనగరం టౌన్: బాలకేంద్రంలో ఈ ఏడాది శిక్షణ పొందేందుకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు జిల్లా బాలకేంద్రం సూపరింటెండెంట్ బుర్రా శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న బాలకేంద్రంలో శాస్త్రీయ సంగీతం, భరతనాట్యంలో శిక్షణ ఇస్తామని.. ఔత్సాహిక బాల, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 94415 72195 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: మండలంలోని మారెడుబాక గ్రామానికి చెందిన ఆర్.ప్రవీణ్‌కుమార్ అదృశ్యంపై బుధవారం కేసు నమోదుచేసినట్లు సీఐ కె.రవికుమార్ తెలిపారు. డిగ్రీ వరకు చదువుకున్న ప్రవీణ్‌కుమార్ ఇంటి వద్దనే ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. శ్రీకాకుళం ఆంధ్రాబ్యాంకులో ఉన్న తన అకౌంట్‌ను రాజాం బ్రాంచ్‌కి బదిలీ చేసేందుకు ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెంది అన్ని చోట్ల వెతికారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న కోలాటం


కోలాటంలో కళాకారులు

రేగిడి: రేగిడిలో వెలసిన దత్తపీఠంలో గ్రామానికి చెందిన యువతతో పాటు భజన బృందం కోలాటాన్ని బుధవారం ప్రదర్శించారు. ఈ కోలాటం పలువురిని ఆకట్టుకుంది. రేగిడితో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధికసంఖ్యలో హాజరై కోలాటాన్ని తిలకించారు.

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

- ఎంపీపీ అప్పలనాయుడు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: పటిష్ట ప్రణాళికలతోనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. విజయనగరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు 2024 – 25 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి – ప్రణాళికలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి పట్టుగొమ్మలైన గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామ అభివృద్ధి ప్రణాళికలే ముఖ్యమన్నారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎన్ఆర్ఈజీఎస్, ఆరోగ్య నిధులు, వ్యవసాయ శాఖకు సంబంధించిన నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పంచాయతీల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల మహిళలు, పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వివిధ కమిటీలను భాగస్వాములు చేయాలని సూచించారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత పొగిరి


పొగిరి, కొత్తవలస జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న పోటీ

రాజాం/రాజాం సిటీ: పట్టణంలోని జీసీఎస్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మహిళల కబడ్డీ ఫైనల్స్ పోటీలు పొగిరి, కొత్తవలస జట్ల మధ్య బుధవారం జరగగా.. పొగిరి జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. విజేతలను మున్సిపల్ కమిషనర్‌తో పాటు పీడీ అజయ్‌కుమార్, కోచ్ సాయి, తదితరులు అభినందించారు.

నేటి నుంచి మండల స్థాయి క్రికెట్ మ్యాచ్‌లు

సంతకవిటి: 'ఆడుదాం ఆంధ్ర' మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం నుంచి క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.వి.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు మైదానానికి చేరుకోవాలని కోరారు.

జీవామృతంతో చీడపీడల నివారణ


జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి సేద్యం సిబ్బంది

రేగిడి: రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు చీడపీడల నివారణకు జీవామృతం ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం పీఆర్‌పీ రమాదేవి అన్నారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో బుధవారం రైతులకు జీవామృతం తయారీ విధానంపై ఐసీఆర్‌పీలతో అవగాహన కల్పించారు. ఒక ఎకరానికి జీవామృతం పిచికారీ చేయాలంటే ఆవుపేడ 5 కిలోలు, పశువుల మూత్రం 5 లీటర్లు, ఇంగువ ద్రావణం 200 గ్రాములు ఐదు లీటర్ల నీటిలో కలిపి ఒక తొట్టిలో నాలుగు రోజులు నిల్వ చేయాలి. ఉదయం, సాయంత్రం కర్రతో సవ్యదిశలో కలపాలి. ఈ మిశ్రమానికి 150 గ్రాముల సున్నం కలపాలి. 200 గ్రాముల ఇంగువ ఒక రెండు లీటర్ల నీటిలో బాగా మరగబెట్టి దానిలో ముద్ద ఇంగువ వేసి చక్కగా కలిపి చల్లారిన తరువాత ఇంగువ ద్రావణాన్ని పేడ మూత్రం ద్రావణంలో కలపాలి. ఈ ద్రావణాన్ని గుడ్డలో వడకట్టాలి. ఈ ద్రావణానికి 200 లీటర్ల నీటిని కలిపి ఒక ఎకరా పొలానికి పిచికారీ చేయవచ్చు. ఈ విధానాన్ని రైతులు తక్కువ ఖర్చుతో పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆహారాన్ని పండించుకోవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, గుండాల రవి, పొదిలాపు సురేష్, కూను బిల్లి రమణ, రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైభవంగా తీర్థమహోత్సవాలు


వేపాడ: ముకుందపురంలో సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న జనసందోహం


జామి: ఎం.కె.వలసలో కన్నమ్మ తల్లి తీర్థమహోత్సవంలో భక్తుల సందడి


వేపాడ: ముకుందపురంలో పట్టువస్త్రాలంకరణలో జగన్నాథస్వామి


శృంగవరపుకోట: బక్కునాయుడుపేటలో ఎడ్ల పరుగు పోటీలు

జామి: మండలంలోని ఎం.కెవలస గ్రామంలో కన్నమ్మతల్లి, శిరికిపాలెంలో కొత్తమ్మతల్లి పేరంటాలు, చింతాడలో మల్లికార్జునస్వామి తీర్థమహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవార్లను, మల్లికార్జున స్వామిని దర్శించుకు న్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు పసుపు, కుంకుమ, గాజులు,చీరలు, రవికలు సమర్పించి మొక్కులు చెల్లిం చుకున్నారు. ఎం.కె.వలస జాతరకు బలరాంపురం,కుమరాం,భీమసింగి పొట్నూరు తదితర గ్రామాల నుంచి, శిరికిపాలెం జాతరకు అలమండ, కలగాడ,భీమాళి తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవ కమిటీలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశాయి.

అంకమ్మ పేరంటాల తీర్థం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం పంచాయతీ పరిధి బక్కునాయుడుపేటలో గ్రామదేవత అంకమ్మపేరంటాల తీర్థం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పందాల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంబరాలు పూర్తికాగానే మండలాల్లో తీర్థమహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సంక్రాంతి నుంచి ఉగాది వరకు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు కొనసాగుతుంటాయి.

జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు

వేపాడ: మండలంలోని ముకుందపురం గ్రామంలో వేంకట జగన్నాథస్వామి తీర్థమహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి కనకరాజు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పేదలకు చీరలు, పంచెల పంపిణీ

చీపురుపల్లి: సంక్రాంతి పండగ నేపథ్యంలో మండలంలోని పుర్రేయవలస గ్రామంలో పేదలకు పంచెలు, చీరలను ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం దంపతులు బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రామలింగాపురం, పుర్రే యవలస గ్రామాల్లో ఏటా సంక్రాంతికి ప్రజలకు కానుకలు అందజేస్తున్నామని చెప్పారు. మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని తెలిపారు. పుర్రేయవలస గ్రామంలో భూములకు తోటపల్లి కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తు న్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారని పేర్కొన్నారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కంది అప్పారావు, సిరేల రాములు, సారిక ఆనంద్, కంది త్రినాథ్, శ్రీరాములు, దుర్గారావు పాల్గొన్నారు.